క్లుప్తంగా

ఆరోగ్యంపై దృష్టి సారించాలి

• ఆర్‌కేఎస్‌కే కౌన్సిలర్ కొండమ్మ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌కేఎస్‌కే కౌన్సిలర్ కొండమ్మ

విజయనగరం ఫోర్ట్: విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై దృష్టి సారించాలని ఆర్‌కే ఎస్‌కే కౌన్సిలర్ అంబళ్ల కొండమ్మ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. కౌమార దశలో వచ్చే మార్పుల గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో పిఓ రామాచారి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్లపై అప్రమత్తం



చొల్లంగిపేట పొలంలో ఆకుముడత పురుగు ఆశించిన వరిపంటను పరిశీలిస్తున్న ఏఓ పి.నిర్మల, తదితరులు

డెంకాడ: వరి పంటకు ఆకుముడత పురుగు ఆశించే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి పూడి నిర్మల తెలిపారు. మండలంలోని చొల్లంగిపేట, గుణుపూరుపేట, తదితర గ్రామాల్లో శుక్రవారం పర్యటించి వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వరి పంట పిలకలు పెట్టే దశ నుంచి చిరుపొట్ట దశలో ఉందన్నారు. ప్రస్తుతం కొన్నిచోట్ల వరికి ఆకుముడత పురుగు సోకిందని తెలిపారు. ఈ పురుగు నివారణకు 200 లీటర్ల నీటిలో మోనోక్రోటాఫాస్ 36శాతం ఈసీ–360 ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

ఉపాధి పనులపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుధారాణి

నెల్లిమర్ల: మండలంలోని అన్ని పంచాయతీల్లో చేపట్టబోయే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో ఎంపీపీ అంబళ్ల సుధారాణి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రాబోయే మూడేళ్లలో గ్రామాల్లో చేపట్టబోయే ఉపాధి పనులపై తీర్మానం చేసి కలెక్టర్‌కు పంపిస్తామన్నారు. సమావేశంలో సౌత్ సెంట్రల్ రైల్వే సలహా మండలి సభ్యులు అంబళ్ల శ్రీరాముల నాయుడు, వైస్ ఎంపీపీ సారిక వైకుంఠం, తదితరులు పాల్గొన్నారు.

విరాళాల సేకరణ




బాక్స్‌లో విరాళాలు వేస్తున్న విద్యార్థులు

విజయనగరం టౌన్: విద్యార్థులకు దానగుణం అలవర్చాలనే ఉద్దేశ్యంతో వరద బాధితులకు సహాయార్థం విరాళాలు సేకరిస్తున్నట్లు గాజులరేగ నారాయణ స్కూల్ కరస్పాండెంట్ మొయిద నారాయణరావు అన్నారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో శుక్రవారం విరాళాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం మనందరి బాధ్యతన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'కోట'లో ఫ్లెక్సీల వార్

శృంగవరపుకోట: పుట్టిన రోజు వేడుకల కోసం పెట్టుకున్న ఫ్లెక్సీల వివాదం పోలీస్‌స్టేషన్ చేరింది. ఇటీవల రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా స్థానిన జనసేన నాయకులు పట్టణంలో దేవీ జంక్షన్‌లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కాగా మాజీ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పుట్టిన రోజు సందర్భంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసేందుకు డిప్యూటీ సీఎం ఫ్లెక్సీలు తొలగించేందుకు గురువారం రాత్రి రఘురాజు వర్గీయులు సిద్ధం అయ్యారు. దీన్ని జనసేన నాయకులు వ్యతిరేకించారు. మరోక చోట ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించటంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. శుక్రవారం రఘురాజు వర్గీయురాలైన ఎస్.కోట సర్పంచ్ సంతోషికుమారి మీడియా సమావేశం నిర్వహించి జనసేన పార్టీ నాయకుడు ఒబ్బిన సత్యనారాయణ తనతో ఫోన్‌లో అసభ్యంగా మాట్లాడారని, బెదిరించారన్నారు. గతంలో పంచాయతీకి ఆదాయం కోసం ఫ్లెక్సీలు కట్టేవారు నగదు చెల్లించాలని తీర్మానం చేశామని, తాము నగదు చెల్లించి ఫ్లెక్సీలు కడితే, అడ్డుకుని రాద్ధాంతం చేస్తున్నారని తెలిపారు.

• ఆకాశం మెరిసె..







విజయనగరం జిల్లా కేంద్రంలో శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా మేఘాలు కమ్ముకోవడంతో పాటు వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. దీంతో కోట ప్రాంతంలో వెలుగులు విరజిమ్ముతూ మెరుపులు రావడంతో ఆకాశం మెరిసింది. అయితే ఎక్కడ పిడుగులు పడతాయోనని ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

సస్యరక్షణతో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన చేస్తున్న వ్యవసాయ అధికారి నీలిమ

• ఏఓ నీలిమ

పూసపాటిరేగ: వరిలో సస్యరక్షణతోనే అధిక దిగుబడులు సాదించవచ్చునని మండల వ్యవసాయాధికారి కె. నీలిమ అన్నారు. మండలంలోని రెల్లివలసలో జీఏపీ వరి పొలంబడి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు మిత్ర పురుగులు, శత్రు పురుగులు గురించి అవగాహన కల్పించారు. ఉధృతిని బట్టి పురుగు మందులు వినియోగించాలని సూచించారు. గొంగళి పురుగులు, రసం పీల్చే పురుగులను గుర్తించి సకాలంలో మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో రైతు ఉత్పత్తి కేంద్రం సీఈఓ ప్రభాకర్, వ్యవసాయశాఖ అసిస్టెంట్ అనిత, రైతులు పాల్గొన్నారు.

మెలకువలు పాటించాలి...

భోగాపురం: రైతులు మెలకువలు పాటించడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయ శాఖాధికారి వి. కృష్ణ అన్నారు. మండల కేంద్రమైన భోగాపురంలో శుక్రవారం వ్యవసాయ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రైతూ తన పొలంలో కాలిబాటలు తీసుకోవాలని సూచించారు. దీనివల్ల పైరుకు గాలి, వెలుతురు బాగా తగిలి చీడపీడల బెడద ఉండదన్నారు. అలాగే దోమ ఉధృతి తగ్గుతుందని చెప్పారు. గ్రామాల్లో వరి పంట వేసిన ప్రతి రైతూ విధిగా ఈ పంటలో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. రెడ్డిస్ ఫౌండేషన్ ద్వారా వ్యవసాయానికి సంబంధించిన పనిముట్లతో పాటు రబీ సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, పండ్ల మొక్కలను రాయితీపై అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధులు హరి, భాస్కర్, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



భోగాపురం: వరి పంటపై రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయ శాఖాధికారి హరికృష్ణ

భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలు గొప్పవి

• ఎమ్మెల్యే పూసపాటి అధితి గజపతిరాజు

విజయనగరం: ప్రపంచ దేశాల్లో భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలు గొప్పవని విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అధితి గజపతిరాజు అన్నారు. నగరంలోని బాలాజీనగర్ ప్రాంతంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అవనాపు విజయ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భావితరాలకు మన సంప్రదాయాలను తెలియజెప్పాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.



అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అధితి గజపతిరాజు

వెటర్నరీ అసిస్టెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కిశోర్



జేడీని కలిసిన నూతన కార్యవర్గ ప్రతినిధులు

విజయనగరం ఫోర్ట్: వెటర్నరీ అసిస్టెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా బొంగు కిశోర్ ఎన్నికయ్యారు. శుక్రవారం స్థానిక యూత్ హాస్టల్‌లో ఫెడరేషన్ ఎన్నికలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీ ఫెడరేషన్ చైర్మన్ సేవానాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో అసోసియేషన్ సెక్రటరీగా పి. రామకృష్ణ, లైవ్ స్టాక్ అసిస్టెంట్ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎల్. వాసుదేవరావు కార్యదర్శిగా పి. చిన్నారావు.. జూనియర్ వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తారకేశ్వరరావు, కార్యదర్శిగా అమరనాథ్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులు పశు సంవర్ధకశాఖ జేడీ వైవీ రమణను మర్యాదపూర్వకంగా కలిశారు.

సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం



తరుణీ ఉత్సవ్‌లో పాల్గొన్న క్లబ్ ప్రతినిధులు

• ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు శిరీష

విజయనగరం: ఇన్నర్‌వీల్ క్లబ్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇస్తామని క్లబ్ అధ్యక్షురాలు జి.శిరీష అన్నారు. పట్టణంలోని పూల్‌బాగ్‌కాలనీలో గల శ్రీరస్తు కన్వెన్షన్ హాల్‌లో ఇన్నర్‌వీల్ క్లబ్ తరుణీ ఉత్సవ్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన క్లబ్ అధ్యక్షురాలు శిరీష మాట్లాడుతూ, ప్రతి ఏడాదీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించి తద్వారా వచ్చిన నగదుతో ఏడాది పొడవునా సామాజిక సేవా, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పట్టణంలోని వివిధ ప్రాంతాలతో పాటు జిల్లా వ్యాప్తంగా వందలాది మహిళలు హాజరయ్యారు. ఆయా క్లబ్‌ల ప్రతినిధులు తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శించగా.. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో మహిళలంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్ సెక్రటరీ కల్పన కుక్రేజా, ప్రాజెక్ట్ చైర్‌పర్సన్ బి. శ్వేత, క్లబ్ పూర్వపు అధ్యక్షురాలు ఉమాబాలాజీ, ఎ.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులంటే అంత చులకనా..!

• మండల సమావేశంలో ఎంపీటీసీల ఆవేదన

• సచివాలయ సిబ్బంది తీరుపై అసంతృప్తి

లక్కవరపుకోట: ప్రజల చేత ఎన్నికోబడిన ప్రజాప్రతినిధులకు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో, సంక్షేమ పథకాల అమల్లోను కనీసం గుర్తింపు లేకుండా పోయిందని పలువురు ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిషత్ భవనంలో ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ కె.రూపేష్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అధికారులను ప్రశ్నలతో నిలదీశారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా పనుల గుర్తింపునకు గ్రామ సభలు నిర్వహించారని కనీసం తమకు సమాచారం ఇవ్వలేదని చందులూరు, రేగ ఎంపీటీసీలు యడ్ల కిశోర్, బొడ్డు గణపతి నిలదీశారు. గ్రామాల్లో వెలుగు కార్యాలయం ఆధ్వర్యంలో పని చేసే బుక్ కీపర్లను ఇష్టానుసారంగా తొలగించారని ఇది ఎంత వరకు సమంజసమని సంబంధిత అధికారిని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయ ఉద్యోగులు చేతివాటం మొదలుపెట్టారని ఎంపీటీసీ కిశోర్ అన్నారు. సచివాలయాల ద్వారా అందించే సేవలకు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే అధిక మొత్తంలో లబ్ధిదారుల నుంచి వసూళ్లు చేస్తున్నారని మండిపడ్డారు. దీనికి సంబంధించిన సాక్ష్యాలను ఎంపీపీ, ఎంపీడీఓకు చూపించారు. ఈ అక్రమ వసూళ్లపై సమగ్ర విచారణ చసి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శ్రీరాంపురం, ఆర్‌జీపేట సమీపాల్లో గల స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్ తదితర కర్మాగారాల నుంచి కాలుష్యం పెరిగిపోయిందని మూడేళ్లగా ఈ విషయమై సమావేశాల్లో ప్రస్తావిస్తున్నా అధికారులు కనీసం స్పందించడం లేదని తామరాపల్లి సర్పంచ్ ముచ్చు భాస్కరరావు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీఓ రూపేష్ మాట్లాడుతూ సభలో సభ్యులు ప్రస్తావించిన అంశాలపై పూర్తి స్థాయిలో విచారణ చేసి వచ్చే సమావేశానికి సమగ్ర నివేదికలు సభలో పెడతామన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ శ్రీనురాజు, తహసీల్దార్ ప్రసాదరావు, ఈఓపీఆర్‌డీ జ్ఞానేశ్వరరావు, పలువురు అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.



ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల గుర్తింపుపై సభలో ప్రస్తావిస్తున్న ఎంపీటీసీ కిశోర్

పోరాటయోధుడు ఏచూరి..



విద్యుత్ జిల్లా స్టోర్స్ వద్ద ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హమాలీలు, నాయకులు



మొయిద జంక్షన్ వద్ద నివాళులర్పిస్తున్న వామపక్ష, ప్రజాసంఘ నాయకులు

సీపీఎం అగ్ర నేత సీతారాం ఏచూరి పోరాట యోధుడని వక్తలు కొనియాడారు. ఆయన మృతి సందర్భంగా శుక్రవారం నగరంలో పలుచోట్ల సంతాప సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలు, పోరాటాలను గుర్తు చేసుకున్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిని ఏచూరిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యుత్ జిల్లా స్టోర్స్ వద్ద విద్యుత్ హమాలీలు సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కిల్లంపల్లి రామారావు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. మొయిద జంక్షన్‌లో సీపీఎం, సీపీఐ (ఎం.ఎల్) నాయకుల ఆధ్వర్యంలో జోహార్లు అర్పించారు. అలాగే ఎల్ బీజీ నగర్ వద్ద సీపీఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు ఆధ్వర్యంలో సంతాపసభ నిర్వహించి, సీతారామ్ ఏచూరికి నివాళులర్పించారు.



ఎల్‌బీజీ నగర్ వద్ద సంతాప సభ

– నెల్లిమర్ల

ఎస్కార్ట్ సిబ్బందికి చికిత్స

విజయనగరం ఫోర్ట్: రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యరాణి ఎస్కార్ట్ వాహనాన్ని వేరొక వాహనం ఢీకొన్న సంఘటనలో గాయపడిన ఎస్కార్ట్ సిబ్బంది విజయనగరంలోని తిరుమల మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వాహన డ్రైవర్ సత్యనారాయణరాజు, ఏఆర్ హెచ్‌సీ పి. సునీల్ ఐసీయూలో ఉండగా..ఏఆర్ ఎస్సై కేవీ రమణ, పీసీ ఆర్. గణపతి, మహేష్ జనరల్ వార్డులో చికిత్స పొందుతున్నారు.

నీటిని వృథా చేయరాదు

• ఎమ్మెల్యే లోకం నాగమాధవి



కోనాడలో తాగునీటి ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి, తదితరులు

పూసపాటిరేగ: నీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. మండలంలోని కోనాడ గ్రామంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కోనాడ గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. భూగర్భజలాలు పెంపొందించే దిశగా ప్రజలు సహకరించాలన్నారు. గ్రామంలో దేవాలయ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాధిక, తహసీల్దార్ గోవింద, ప్రజాప్రతినిధులు బాలా అప్పలరాజు, దంగా భూలోక, బొడ్డు ఎల్లాజీ, మహంతి శివ, జలపార శివ, శంకాబత్తుల సత్తిబాబు, దారపు లక్ష్మణరెడ్డి, కె. రమేష్, సురేష్, కారి అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

కారుఢీకొని వ్యక్తికి గాయాలు

గజపతినగరం: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద కారు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యాడు. శుక్రవారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గజపతినగరంలోని బూర్లి వీధికి చెందిన చంటి అనే వ్యక్తి తన బండికి ఆయిల్ కొట్టించేందుకు పెట్రోల్ బంక్‌కు టీవీఎస్ వాహనంపై బయలు దేరాడు. అదే సమయంలో కారులో గుంటూరు నుంచి కొరాపుట్ వెళ్తున్న శ్రీనివాస్ అనే వ్యక్తి వెనుక నుంచి టీవీఎస్‌ను ఢీకొట్టాడు. దీంతో చంటికి గాయలయ్యాయి.

17 నుంచి స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ విశ్వేశ్వరరావు

• నగర పంచాయతీ కమిషనర్ విశ్వేశ్వరరావు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని 20 వార్డుల్లో ఈ నెల 17 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు స్వచ్ఛతా హి సేవా – 2024 కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిషనర్ టీవీఎస్ విశ్వేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు కార్యక్రమంలో భాగంగా చేపట్టాల్సిన పనుల గురించి చర్చించేందుకు శుక్రవారం స్థానిక కార్యాలయంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఉమాభాస్కర్, కార్యదర్శులు, మెప్మా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. స్వభావ్ స్వచ్ఛత – సంస్కార్ స్వచ్ఛతలో భాగంగా 15 రోజుల పాటు ప్రతిరోజూ చేపట్టాల్సిన కార్యక్రమాల వివరాలు వెల్లడించారు. ప్రణాళికా ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పట్టణవాసులను భాగస్వాములను చేయాలని కమిషనర్ సూచించారు. సమావేశంలో మెప్మా సీఎంఎం గోవింద్, సీఓ పోలినాయుడు, శానిటేషన్ కార్యదర్శులు రమణ, రాము, తదితరులు పాల్గొన్నారు.

సాక్ష్యాధారాలు కీలకం..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఫోరెన్సిక్ విద్యార్థులకు హ్యాండ్లింగ్ ఆఫ్ మైక్రోస్కోప్స్ అండ్ క్రైమ్ సీన్ మేనేజ్‌మెంట్ అనే అంశంపై శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కోర్టు నుంచి అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పీబీఎస్ సాయిపవిత్ర గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నేరాల రుజువులకు ఫోరెన్సిక్ విభాగం సేకరించిన ఆధారాలు ఏవిధంగా దోహదపడతాయో వివరించారు. ఖరగ్‌పూర్ నుంచి వచ్చిన మరో గౌరవ అతిథి అడ్వకేట్ కె.చిన్నరెడ్డి పాల్గొని ప్రసంగించారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ రమణారావు, డీన్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, డీన్ డాక్టర్ విజయ్‌బాబు, ప్రవల్లిక, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న పవిత్ర